విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ ..

దోమ, డిసెంబర్ 5: మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని జరుపుకొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేష్‌బాబు,ఎంఈవో వెంకట్, ఎంపీవో సోమలింగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులను గౌరవించాలి

దోమ, డిసెంబర్ 5 : దివ్యాంగులను గౌరవించి వారికి సముచిత న్యాయం కల్పించే దిశగా కృషి చేయాలని మండల విద్యాధికారి వెంకట్, ఎంపీడీవో మహేష్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ దివ్యాం గుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్ఎం స్వాతి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో వెంకట్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో సోమలింగం, ఉపాధ్యాయులు గోపాల్, సాయికుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మండల ఆరోగ్యాధికారిగా రుబియానాజ్

యాలాల, డిసెంబర్ 5: యాలాల మండల నూతన ఆరోగ్యాధికారిగా రుబియా నాజ్ నియమితులయ్యారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డా. రుబియానాజ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీహెచ్‌వో చంద్రశేఖర్ బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డా. రుబియా నాజ్ మాట్లాడుతూ... ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలను అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎల్ మంజుల, జూనియర్ అసిస్టెంట్ బసయ్య, ఏఎన్ఎమ్‌లు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

పరిగి, డిసెంబర్ 5 : ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పరిగిలోని జాతీయ రహదారిపై టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద వాహనాలను పోలీసులు తనిఖీ చేయడంతోపాటు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా వారు వాహనదారులకు అవగాహన కల్పిస్తూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగినా తక్కువ గాయాలతో బయటపడే అవకాశం ఉంటుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని వారు పేర్కొన్నారు. వాహనాలను ఓవర్‌టేక్ చేసే సమయంలోను జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ముగ్గురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. అలాగే గతంలో జరిమానాలు విధించిన వారితో చలానాలు చెల్లింపు చేపట్టారు.

సారవంతమైన నేలను కాపాడుకోవాలి

నేలలోని రకాలను రైతులకు వివరిస్తున్న ఏవో జ్యోతి

వికారాబాద్, డిసెంబర్ 5 : ప్రకృతి మనకు ఇచ్చిన అపారమైన వనరులలో నేల ముఖ్యమైనదని మండల వ్యవసాయాధికారి జ్యోతి తెలిపారు. గురువారం వికారాబాద్ మండల పరిధిలోని సిద్దులూర్ గ్రామంలో రైతులతో కలిసి ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం నేలలోని రకాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు సుస్థిరమైన, సారవంతమైన నేలను అందించటానికి కృషి చేయాలన్నారు. సహజ సూక్ష్మజీవుల సంరక్షణ, అధిక రసాయన ఎరువులు , పురుగు మందుల వాడకంతో నేల జీవరాశులు నష్టపోతున్నాయన్నారు. 22 రకాల నేలలతో తెలంగాణ సంపన్నం.. నల్ల, ఎర్ర, ఇసుక నేలలలోని నీటి నిల్వ సామర్థ్యాన్ని, పోషకాల అందుబాటును మెరుగుపరచాలన్నారు. పచ్చిరొట్ట పంటల వాడకం (జీలుగా, జానుము, పిల్లిపెసర) ద్వారా నేలసారవంతాన్ని పెంచుకోవచ్చన్నారు. సుక్ష్మపోషకాల కొరతను గుర్తించి, సహజ పద్ధతుల్లో తీర్చాలన్నారు. వాలుకు అడ్డంగా దున్నడం వల్ల భూమి కోతను నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. బోర్లు లోతుగా తీయడం వల్ల లవణ పొరల సమస్య పెరుగుతోందన్నారు. దీన్ని నివారించేందుకు నీటి వనరులను సమర్థవంతంగా ఉపయోగించాలని సూచించారు. నేలలోని రకాలను, నేల సాంద్రతను తదితర విషయాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కావ్య, రైతులు ఉన్నారు.

ఘనంగా స్వయంపరిపాలనా దినోత్సవం

మర్పల్లి, డిసెంబర్ 5 : మండలంలోని పంచలింగాల్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయంపరిపాలనా దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తరగతి గదుల్లో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ బోధన చేసిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో అంజిలయ్య, ప్రధానోపాధ్యాయులు కేశవులు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, శ్రీకాంత్, సీఆర్‌పీలు మల్లేశం, మహబూబ్ అలీ పాల్గొన్నారు..

వివాహిత అదృశ్యం

తాండూరు రూరల్, డిసెంబర్ 5 : వివాహిత అదృశ్యమైన సంఘటన కరణ్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...తాండూరు మండలం, గౌతాపూర్ గ్రామానికి చెందిన మ్యాతరి సంపూర్ణ (25) ఈ నెల 4వ తేదీన ఇంటి వద్ద ఉంది. భర్త మ్యాతరి శ్రీనివాస్(డ్రైవర్)కు సాయంత్రం 6.30 గంటల సమయంలో వీడియో కాల్ చేసి, ఇంటికి ఎప్పుడు వస్తావని అడిగింది. తనకు ఇంటికి రావడానికి కొంత సమయం పడుతుందన్నాడు. రాత్రి. 8.30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా భార్య సంపూర్ణ కనిపించలేదు. ఇంటి పరిసరాల్లో, బంధువుల వద్ద ఆచూకీ లభించ లేదు. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న షీ టీం ఇన్‌చార్జి నర్సింహులు

పరిగి, డిసెంబర్ 5 : విద్యార్థులు చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని పరిగి డివిజన్ షీ టీం ఇన్‌చార్జి నర్సింహులు సూచించారు. గురువారం పరిగి మండలం గడిసింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాల బారిన పడరాదన్నారు. ప్రధానంగా చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. ప్రతి విద్యార్థి పలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటి నివారణ, నిర్భయ చట్టం, సీసీ కెమెరాలు, బాల్య వివాహాలు, బాలకార్మిక చట్టం, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం తదితర అంశాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతరావు, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దేముల్ వాసి సయ్యద్ ఆతీఫ్‌కు డాక్టరేట్



వికారాబాద్, డిసెంబర్ 5 :వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలానికి చెందిన సయ్యద్ ఆతీఫ్‌కు డాక్టరేట్ లభించింది. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ అండ్ మైక్రోఫైనాన్స్‌లో పరిశోధనకు ఉత్తరప్రదేశ్‌లోని ఫెరోజబాద్ జిల్లా శకుహాబాద్‌లోని జేఎస్ యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్‌ను అందజేసింది. ఆయన శాదన్ ఉమెన్స్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శాదన్ ఉమెన్స్ కాలేజీ చైర్మన్ మహ్మద్ షా ఆలం రసూల్ ఖాన్, డైరెక్టర్ రహమాన్ షరీఫ్, ప్రిన్సిపాల్ పాలనీ, వైస్ ప్రిన్సిపాల్ హిమబిందు, అధ్యాపక బృందం ఆయనను గురువారం మెమోంటో ఇచ్చి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పనులు పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి, డిసెంబర్ 5 : పరిగి మున్సిపల్ పరిధిలోని పలుచోట్ల గురువారం చేపట్టిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కలుపు మొక్కలు తొలగింపు, మురికికాలువలను శుభ్రం చేసే పనులు చేపట్టారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం రోడ్డు పక్కన పెరిగిన కలుపు మొక్కలను మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తొలగించారు. పనులను మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, కమిషనర్ వెంకటయ్య పరిశీలించారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి

నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

డిస్పోసల్ ఆఫ్ నార్కోటిక్ డ్రగ్స్ కమిటీ ధ్వంసం చేయబోయే మాదకద్రవ్యాలను చూపుతున్న సీపీ సీవీ ఆనంద్

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 5: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే కాకుండా యువత పెడదారిన పట్టకుండా అడ్డుకట్ట వేసేలా నగర పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం డిస్పోసల్ ఆఫ్ నార్కోటిక్ డ్రగ్స్ కమిటీ ఆధ్వర్యంలో గోషామహల్ పోలీస్ స్టేడియంలో పట్టుకున్న మాదక ద్రవ్యాలను ధ్వంసం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీ మాట్లాడుతూ.. పట్టుకున్న మాదకద్రవ్యాలను మళ్లీ ఎక్కడ వినియోగించకుండా నగర శివారులో ధ్వంసం చేయడం జరుగుతుందన్నారు. సుమారు 208 కేసుల్లో రూ.7.50కోట్ల విలువజేసే మాదకద్రవ్యాలను డిస్ట్రాయిడ్ చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఇదిలా ఉండగా.. జనవరి నుంచి జూన్ వరకు 118 కేసుల్లో రూ.3 కోట్ల 8లక్షల 14వేల డ్రగ్స్‌ను ఇది వరకే ధ్వంసం చేశామన్నారు. గత మూడేండ్లలో 1200 కేసులు నమోదయ్యాయని, డ్రగ్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా ఉన్నారన్నారు. యువత చెడు పోకడలకు అడ్డుకట్ట వేయడంతో పాటు వారికి అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి కట్టడి చేస్తున్నట్లు తెలిపారు. గత నెలలో నైజీరియన్‌లను పట్టుకున్నామని, రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ నార్కోటిక్ డ్రగ్స్ సంస్థను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్, టీజీనాబ్‌ల సంయుక్తాధ్వర్యంలో డ్రగ్స్‌పై జల్లెడ పట్టడంతో డ్రగ్స్ విక్రయాలు, వినియోగదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా గోషామహల్ పోలీస్ స్టేడియంలో టీజీనాబ్ ధ్వంసం చేయబోయే రూ.7.50 కోట్ల విలువ చేసే మాదకద్రవ్యాలు 21490 కిలోల గంజాయి, 3.8 కిలోల మహకాల్ డ్రగ్స్, 12,669 ఎంఎల్ లీటర్ల హాషిష్ ఆయిల్, 540 అల్ప్రాజోలం టాబ్లెట్స్, 19.34 గ్రాముల కొకైన్, 4 ఎల్ఎస్‌డీ బాటిల్‌లు, 177.75 గ్రాముల ఎండీఎంఏ, 70 గ్రాముల ఓపిఎం తదితర మాదకద్రవ్యాలను ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం నిబంధనలను పాటిస్తూ సీజ్ చేసి ధ్వంసం చేస్తున్నట్లు ఆయన వివరించారు. డీసీపీ డీడీ, డిస్పోసల్ ఆఫ్ నార్కోటిక్ డ్రగ్స్ కమిటీ చైర్మన్ ఎన్.శ్వేత, అడిషనల్ డీసీపీ మనోహర్, డీసీపీ సౌత్ వెస్ట్ చంద్రమోహన్‌తోపాటు ఏసీపీలు, ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

సుమలతది గుండెపోటు కాదు.. హత్యే

అదనపు కట్నం కోసం భార్యను హత్య చేసిన భర్త

ఆపై గుండెపోటుగా చిత్రీకరణ

నిందితుడు సాయిగౌడ్

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 5: భార్యను భర్త గొంతునులిమి హత్య చేసిన ఘటన శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎయిర్‌పోర్టు కాలనీ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ సీఐ బాల రాజు తెలిపిన ప్రకారం.. శంషాబాద్ పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీకి చెందిన సాయి గౌడ్‌కు పదేళ్ల కిందట మహేశ్వరం మండలం డబిల్‌పూర గ్రామానికి చెందిన సుమలత(30)ను ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలం నుంచి భార్య సుమలతను అదనపు కట్నం తేవాలని భర్త సాయి వేధింపులకు గురిచేస్తున్నాడు. అయితే ఇటీవల ఆమెకు కడుపునొప్పి వచ్చినట్లు వైద్యులకు చూపించాడు. తాజాగా బుధవారం రాత్రి ఎవరికి అనుమానం రాకుండా ఆమెను ఇంట్లో గొంతునులిమి హత్య చేశాడు. ఆమె కడుపు నొప్పి భరించలేక గుండెపోటుతో మృతి చెందినట్లు చిత్రీకరించి ఆమె కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. అంత్యక్రియలు చేస్తున్న సమయంలో ఆమె వంటిపై ఉన్న గాయాలు చూసిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పదస్థితిలో మృతి కేసు నమోదు చేసిన పోలీసులు తమదైనశైలిలో విచారణ చేయగా.. భార్యను అదనపు కట్నం కోసం హత్య చేసినట్లు భర్త ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

నవాబుపేట, డిసెంబర్ 5: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఐఈఆర్‌పీ మురళి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు వాటి ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి అబ్దుల్ రహమాన్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నవాబుపేట కాంప్లెక్స్ హెచ్ఎం. మల్లేశం, స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం. కవిత ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఒడిశా కేంద్రంగా నగరంలో

హాశిష్ ఆయిల్ దందా

1.5 కిలోల ఆయిల్, కారు స్వాధీనం

సిటీబ్యూరో, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ): ఒడిశా కేంద్రంగా నగరంలో హాశీష్ ఆయిల్ విక్రయిస్తున్న ఇద్దరిని ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ అధికారులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.5లక్షల విలువచేసే 1.5కిలోల హాశిష్ ఆయిల్, కారును స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... కర్ణాటక ప్రాంతానికి చెందిన కొండె మల్లికార్జున్, నగరానికి చెందిన మహ్మద్ రెహమాన్‌ఖాన్ ఒడిశాకు చెందిన రమేశ్, గంగాధర్ వద్ద నుంచి హాశిష్ ఆయిల్ కొనుగోలు చేసి నగరానికి సరఫరా చేస్తున్నారు. ఒడిశా నుంచి కారులో నగరానికి వస్తున్న మల్లికార్జున్, మహ్మద్ రెహమాన్‌ఖాన్‌లను గురువారం ముందస్తు సమాచారం మేరకు చందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఎస్‌టీఎఫ్ పోలీసులు అడ్డుకుని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో నిందితుల వద్ద రూ.5లక్షల విలువచేసే 1.5కిలోల హాశిష్ ఆయిల్ లభించింది. దీంతో నిందితులిద్దరిని అరెస్టు చేసి వారి నుంచి హాశిష్ ఆయిల్‌తోపాటు రూ.5లక్షల విలువచేసే కారు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అంతే కాకుండా ఒడిశా నుంచి గంజాయి సరఫరా చేస్తున్న రమేశ్, గంగాధర్‌లపై కూడా కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన..

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన డీఈవో

సిటీబ్యూరో, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ): కవాడిగూడలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని జిల్లా విద్యాశాఖ అధికారి డి.రోహిణి గురువారం సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. వారం రోజుల కిందట సురేశ్ అనే ఉపాధ్యాయుడు ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో సదరు విద్యార్థిని వారి తల్లిదండ్రులకు చెప్పగా.. వారు ఉపాధ్యాయుడు సురేశ్‌పై గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ రిపోర్టును విద్యాశాఖ పరిశీలించి తాజాగా సురేశ్‌పై సస్పెన్షన్ విధిస్తూ జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేశారు. కాగా, పాఠశాలల్లో పరిస్థితులపై జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో సమావేశాలు, సమీక్షలు నిర్వహిస్తుంటారు. పాఠశాలల్లో హాజరు శాతం పెంచేందుకు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అయితే ఇది కేవలం కలెక్టరేట్ కార్యాలయం వరకు మాత్రమే పరిమితమవుతుందని.. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

నేరుగా ఫిర్యాదుల స్వీకరణ

జనవరి 6 నుంచి హైడ్రా కార్యాలయంలో గ్రీవెన్స్

జోన్లవారీగా ప్రత్యేక కమిటీలు

వాట్సాప్, ఫోన్‌లోనూ ఫిర్యాదు చేయొచ్చు

సిటీబ్యూరో, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ): కొత్త సంవత్సరంలో హైడ్రా సరికొత్తగా రూపుదిద్దుకోబోతున్నది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) జనవరి 6వ తేదీ నుంచి గ్రీవెన్స్ ప్రారంభించనున్నది. ప్రతి సోమవారం హైడ్రా కార్యాలయంలో 'ప్రజావాణి' నిర్వహించి అందులో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి ఒంటిగంట వరకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఫిర్యాదుల్లో ప్రధానంగా చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలపై ఫోకస్ చేయనున్నట్లు తెలుస్తున్నది. అయితే ప్రభుత్వ స్థలాలు, పార్కులకు సంబంధించి కబ్జాలపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ వాటిని జీహెచ్ఎంసీ విజిలెన్స్ విభాగానికి రిఫర్ చేయనున్నట్లు తెలిసింది. ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బందితో కలిసి తమ వద్దకు వచ్చే వాటర్‌బాడీస్ ఆక్రమణల ఫిర్యాదులపై సమగ్రంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ జరపడానికి నిర్ణయం తీసుకున్నారు. ఫిర్యాదుల రూపంలో వచ్చే ఆక్రమణలపై స్థానికులతో చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, తద్వారా కొత్తగా జరిగే కబ్జాలను అరికట్టవచ్చని హైడ్రా అధికారి ఒకరు చెప్పారు.

వాట్సాప్, ఫోన్ కాల్స్ ద్వారా ఫిర్యాదులు

ప్రజలు నేరుగా ఫిర్యాదులు చేసే అవకాశాన్ని హైడ్రా కల్పించడంతో ఆక్రమణల ఫిర్యాదుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నది. అంతేకాకుండా మరిన్ని ఆక్రమణలు వెలుగులోకి వచ్చే అవకాశముందని హైడ్రా అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా వాట్సప్, ఫోన్‌కాల్స్, మెయిల్స్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను స్వీకరించిన హైడ్రా వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలకు దిగుతున్నది. కొన్ని కోర్టు వివాదాల అంశాలున్నప్పటికీ వాటిపై లీగల్ ఒపినియన్ తీసుకొని ముందుకెళ్తున్నామని హైడ్రా అధికారులు చెప్పారు. ఇప్పటివరకు హైడ్రాకు 4వేలకు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు.

మరోవైపు జోన్ల వారీగా ఒక్కో డిపార్ట్‌మెంట్ నుంచి ఒక్కో అధికారితో పాటు వారికి పోలీస్, ఇతర శాఖల సీనియర్ అధికారి ఒకరిని ఇంచార్జిగా నియమించి ఆయా బృందాలు హైడ్రాకు గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టనున్నారు. వచ్చే ఫిర్యాదులపై ఫిర్యాదుదారుల సహకారంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలకు కూడా ఇవే బృందాలు పనిచేయనున్నాయి. తాము ఇచ్చిన ఫిర్యాదులపై ప్రతి శుక్రవారం హైడ్రా అధికారులతో మాట్లాడి సమాచారం తెలుసుకునే అవకాశం కూడా కల్పిస్తామని హైడ్రా బృందం చెబుతున్నది. వచ్చిన ఫిర్యాదులపై 10 నుంచి పదిహేను రోజుల్లోనే నివేదిక తయారు చేసి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

అతివేగం.. డివైడర్‌ను ఢీకొన్న కారు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 5: అతివేగంగా వచ్చిన ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన ఆరాంఘర్ చౌరస్తాలో గురువారం చోటుచేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి. బెంగళూర్ జాతీయ రహదారి ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వైపు వస్తున్న ఓ కారును డ్రైవర్ అతివేగంగా నడిపాడు. దీంతో ఆ కారు అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటన పై ఎలాంటి ఫిర్యాదు అందలేదని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో స్నేహితుడి హత్య

మలక్‌పేట, డిసెంబర్ 5 : గంజాయి మత్తులో తన స్నేహితుడిని రాయితో మోది హత్య చేసిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆజంపురా క్లాక్ టవర్ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అఖిల్(30), ముస్తఫా (45) అనే ఇద్దరు స్నేహితులు యాచిస్తూ జీవిస్తున్నారు. అయితే మద్యం, గంజాయికి బానిసలైన వీరు మలక్‌పేట రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఉంటున్నారు. నిత్యం మత్తులో ఉండే అఖిల్, ముస్తఫా గురువారం సాయంత్రం గొడవపడ్డారు. ఈ గొడవలో ముస్తఫా అఖిల్ తలపై రాయితో బలంగా కొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. హంతకుడు ముస్తఫాను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు.

PUBLIC NOTICE

General Public is hereby informed that, on 29-11-2024 at afternoon 2-30 P.M. my client Mr. KOTHA ISHTARAIAH, S/o. Bheemaiah, Aged 44 years, Occ: Agriculture, R/o. 3-1, Tirmalapur Village, Rajapur Mandal, Mahabubnagar District-509 202 has Lost his Original SADA BAINAMA SALE DEED pertaining to Agricultural Land bearing Sy.No. 194/ to an extent of Ac. 2-25 Gts. and Sy.No. 281/ /1 to an extent of Ac. 1-00 Gts., situated at Thirumalapur Village, Rajapur Mandal, Mahabubnagar District, Telangana and Lost at Venkiryala Village, Kondurg Mandal, Ranga Reddy District, TS and inspite of his best efforts, it has not been traced out till date. If any persons founds the above document, they may be returned to the under mentioned address and get suitable reward within 7 days from the date of this notice, afterwards, my client will initiate legal process according to law for getting alternative documents.

MARRI NARENDER REDDY,
BA., B.L.,(Spl.) PG-Cyber Law
Advocate, High Court of Telangana,
Off: Plot No. 24, Soujanya Colony,
New Bowenpally,
Secunderabad-500 011,
Ph: 9394759735.